ఆ కోతులాట మే మెప్పుడూ చూస్తున్నదే అయినా, క్రొ్రడొచ్చాడనేసరికల్లా పిల్లలమంతా సరదాగా పరుగెత్తేవాళ్ళం. వాడు కూడా రెట్టింపు ఉత్సాహంగా ఆడించే వాడు. ఆట అదే అయినా వాడి తండ్రి తాతల కంటే నాజూకుగా ఆడించే వాడు క్రొ్రడు.

'నీ అత్తింటి కాపురం. నీ పుట్టింటి కాపురం. నీ సొంతకాపురం' అంటూ ఇక ఇటిక నెత్తిని పెట్టి ఆడమన్నప్పుడు కోతి తప్పగా ఆడకపోతే 'ఆడేస్, నంజ!' అని తిట్టేవాడు వాడి తండ్రి. వీడలాంటి తిట్లు తిట్టేవాడు కాదు. 'బుల్ బుల్, ప్యారీ' వగైరా మాట లెక్కడో నేర్చాడు వీడు అందుచేత అదో కొత్తదనంగా ఉండేది. అంతేకాక, కోతిచేత కొత్త కొత్త విద్యలు చేయించేవాడు. బుగ్గన వేలేసుకుని నాట్యం చెయ్యమనే వాడు. కాలు జారిపడ్డానని కుంటుతూ నడవమనే వాడు. రామ భజన చెయ్యమని చప్పట్లు కొట్టిస్తూ గిరగిర తిరిగించే వాడు.

అన్నిటినీ మించి మరొక విశేషం ఏమిటంటే, వీడి హయాంలో దిగంబరంగా ఉండే కోతికి దుస్తులొచ్చాయి. రంగు రంగుల గుడ్డలు గౌనుల్లాగా, చొక్కాల్లాగా కుట్టించేవాడు. ఓ సారి కాళ్ళకు గజ్జలు కట్టి, చీర చుట్టబెట్టే వాడు. మొత్తానికి రకరకాల ఆకర్షణలు కలిగించి బాగా సంపాదిస్తుండే వాడు.

వాడి తెలివితేటల్ని నే నప్పుడప్పుడు పొగిడేదాన్ని. అందుకే కాబోలు నే నంటే వాడికి చాలా ఇష్టంగా ఉండేది. దాన్ని వాడి పరిభాషలో ఏమనుకునేవాడో నాకు తెలియదుగాని, ఏళ్ళు మీద పడి నాకు జ్ఞానం వస్తున్న కొద్దీ ఎందుకో అది 'ప్రేమ' అనిపించింది నాకు. నా కలా అనిపించిన నాడు చాలా భయం, అసహ్యం వేశాయి. అస లలా ఎందు కనుకున్నానో నాకూ తెలియదు. ఎవరితోనైనా చెపితే నవ్వడమో, నాలుగు చీవాట్లు పెట్టడమో చేసేవారేమో? నే నెవ్వరితోనూ చెప్పలేక నాలో నేనే అదో రకమైన బాధ పడుతూండే దాన్ని.

ఆ బాధ పైకి వెళ్ళగ్రక్కలేక అప్పుడప్పుడు అకారణంగా వాడిని తిట్టేదాన్ని కూడా! తిట్టినా వాడు ఆరాధనగానే చూసేవాడు నా కేసి.

క్రమంగా నాలో భయం పెరగ సాగింది. ఎప్పుడో ఓ నాడు వీడు— 'అమ్మాయిగారూ! మీరంటే నాకు చాలా ఇష్టం' అంటాడేమిటి చెప్మా, కొంపదీసి? ఇదేదో జన్మ జన్మల బంధంగా రూఢీ అవుతుందేమిటి చెప్మా, అదేదో సినిమాల్లో లాగ? అనుకుంటూ హడిలి పోతూండేదాన్ని నేను.

'ఈ కోతులాడించే వాడు నా కెప్పటికీ ఏమీ కాకుండా చూడు, భగవంతుడా' అని రహస్యంగా దేవుడికి దండం పెట్టుకునే దాన్ని.

ఒకసారి మా ఊరి టూరింగ్ టాకీస్ లోకి 'సతీ అనసూయ' సినిమా వచ్చింది. దానిలో అనసూయాదేవి నర్మదకు మరునాడు లేస్తూనే నీ వెవరి ముఖం చూస్తావో వాడే నీ భర్త అనుకో అంటుంది. ఆ ముక్క నా బుర్రలో బాగా నిలిచిపోయిం దెందుకో.

ఈ క్రొ్రడు తప్ప ఇంకెవరు నా భర్తయినా ఫరవాలేదు. నేను కూడా రేపు ఉదయాన లేస్తూనే ఎవరి ముఖం చూస్తానో వాడే నా భర్త అనుకుంటాను. అని ఆదొక పిచ్చి నిర్ణయం చేసుకున్నాను, నా మనసులో. అలా ఎందు కనుకోవాలో అప్పట్లో ఆలోచించాలనిపించలేదు నాకు. మిణుమిణుక్కుమిణుక్కుంటూ ఏదో ఒడ్డుకు చేరుతున్న సంతృప్తి కలిగింది.

మరునాడు ఉదయాన్నే మంచం మీద నించి లేస్తూనే బితుకు బితుగ్గా చూసుకుంటూ వాకిట్లో కొచ్చాను.

క్రొ్రడు కోతితో సహా ఎదురుగా నిలుచునున్నాడు!

నాలో భయం, కోపం ఒకాదాన్నొకటి మించిపోయి పిచ్చిదానిలా తయారయాన్నేను. నోటికొచ్చినట్టు వాడిని తిట్టి అవతలకి పొమ్మన్నాను. వాడు వెర్రి ముఖం పెట్టుకుని చూస్తుంటే మా అమ్మ వచ్చి నన్నే మందలించింది.

ఆ వేళ కూడా వాడు కోతి నాడించాడు. మా మామ్మ కుంచెడు ధాన్యం పోసింది వాడి సంచీలో. విధి బలీయమంటారు. నేను వీడి పాలపడతానేమిటి చెప్మా! అని నాలో భయం వేళ్ళు తన్నుకో సాగింది.

ఈ రంపపు కోత ఇలా ఓ పక్కనుంచి అనుభవిస్తూనే ఆ ఊళ్ళోనే స్కూలు ఫైనలు పాసయ్యాన్నేను. నా భయం మాత్రం పిసమంత కూడా దగ్గలేదెందుచేతో. క్రొ్రడెప్పటి లాగే ఉన్నాడు.

కాని, ఒకనాడు హఠాత్తుగా నా భయమంతా పటాపంచలయిపోయింది. ఆ రోజే నాకు పెళ్ళిచూపు లేర్పాటుచేశారు. ఆయన నవ మన్మథుడిలా ఉన్నారు. నేను నచ్చానని వెంటనే చెప్పేశారు. నా పెళ్ళి నిశ్చయమైపోయింది. ఆ వేసవి లోనే ఆయనతో నా పెళ్ళి మహా వైభవంగా జరిగిపోయింది.

నాకు క్రొ్రడంటే పూర్తిగా భయం తగ్గిపోయింది. ఆ తరవాత వాడు వచ్చినప్పుడు వాడితో మామూలుగా మాట్లాడగలిగాను. వాడు అప్పుడూ, ఇప్పుడూ ఒక్కలాగే ఉన్నాడు. నేనే లేనిపోనివన్నీ కల్పించుకుని యమయాతన పడ్డాననిపించింది.

ఈ సంగతి ఎవరితోనైనా ఎప్పుడైనా చెప్పాలనిపించేది నాకు. అతి సన్నిహితంగా ఉండే ఆయనతో తప్ప ఇంకెవరితో చెప్పగలను? కాని, తీరా


## ఎ. శ్యామలారాణి

చెపితే ఆయనకి నా భావాలు, మాటలు అసహ్యకరంగా తోస్తాయేమోనని భయపడి చెప్పలే దెప్పుడూ.

ఆయనకు నేనన్నా, నా అందమన్నా వల్లమాలిన అపేక్ష. దాన్ని నేను నిజంగా మాటల్లో వర్ణించి చెప్పలేను. వాళ్ళది కూడా బాగా సంపన్న కుటుంబం. ఆయన తల్లితండ్రుల కొక్కడే కొడుకు. అందుచేత నాకూ అతి గారాబం జరిగేది. కాని, ఒక్కొక్కప్పుడు ఆ గారాబమే ప్రాణాంతకంగా ఉండేది!

నేను పల్లెటూళ్ళో పుట్టి పెరగడం చేత, పట్నవాసానికి అనుకూలంగా నా మాటల తీరు తెన్నులు, నా అలవాట్లు ఎలా మారాలో ఆయన దగ్గరఉండి అతి జాగ్రత్తగా బోధపరుస్తున్నప్పుడు నాకు నవ్వొస్తుండేది. నేను ముఖం, చేతులూ ఎక్కువగా తిప్పి మాట్లాడతానట. అలా అంటే కొన్నాళ్ళ పాటు బిగుసుకుపోయాన్నేను. 'ఛ ఛ! మరీ అలా తయారయితే ఎలా? సున్నితంగా కదులుతూ మాట్లాడుతూంటేనే అందం' అన్నా రాయన. చేతులు మండల దగ్గర విరగ్గొట్టినట్టుగా వేలాడేసి కొద్దిగా అటూ, ఇటూ తిప్పుతూ కబుర్లు చెప్పడ మొక అందమట! ఏమిటోలా అనిపించేది నాకు.

ఎన్ని నగలో, ఎన్ని రకరకాల డ్రెస్సులో, ఎన్ని ఫాషన్లో! నేను చాలా మారిపోయాను. అయితే, నేను మారానా, మార్చబడేనా అన్న ప్రశ్నకు తావీయకుండా, ఆయన



ఇష్టంకోసం ఏమైనా చెయ్యాలి అని మాత్రం అనిపించేది.

నాకు కొత్తలో లిప్‌స్టిక్ వేసుకోవటం అంటే చిరాకు వేసేది. ఇప్పుడు లిప్‌స్టిక్ లేకుండా నేను ఇంట్లో కూడా తిరగను. నా బారెడు జుత్తు బాబ్డ్ హెయిర్‌గా మారిన నాడు కించిత్తు బాధనిపించినా, ఆయన కళ్ళలో మెరుపులు చూస్తూ, తియ్యనైన మాటలు వింటూ ఎలాగో నిగ్రహించుకున్నాను.

ఆయన నాకు వివిధ భంగిమల్లో ఫోటోలు తీసే వారు. నా కొక్కొక్కసారి మహా విసుగనిపించేది. విసుక్కునే దాన్ని కూడా. కాని, ఆయన కోపం తెచ్చు కొనేవారు కాదు. తియ్యగా మాటలు చెపుతూనే నా చేత ఆయనకి కావలసి నట్లు చేయించుకునే వారు. క్రమంగా నేను కేవలం ఆయనకోసం అనుకోవడం అలవాటు చేసుకున్నాను. నా కేదో సంతృప్తి లభిస్తున్నట్లనిపించే దలా అను కోవటంలో.

నేను చాలా ఆనందంగా ఉన్నప్పుడు "నే నా కోతు లాడించే వాడి పాలబడతా నేమోనని హడలి చచ్చేదాన్ని సుమండీ!' అని చటుక్కున అనేస్తానేమో నని భయపడేదాన్ని. కాని, ఎలాగో నిగ్ర హించుకుంటూనే వచ్చాను.

ఆయన ఒకసారి మద్రాసు వెళ్ళవలసి వచ్చి నన్ను ఒంటరిగా వదలటం ఇష్టంలేక మా ఊర్లో దింపేశారు. ఆయన అను క్షణం నా వెనకాలే ఉండి, 'ఇలా చెయ్యి', 'అలా ఉండు', 'ఇలా మాట్లాడు' అని చెప్పకపోవడం అదేదో వెలితిగానే అనిపించినా, ప్రాణాని కేదో కాస్త విశ్రాంతి లభించినట్లు కూడా అయింది నాకు (ఈ రెండో మాట నే నెన్నడైనా పైకి అంటే చాలా ప్రమాదమని నాకు తెలుసు).

'కోరడొస్తున్నాడా?' అని అడిగా నింట్లో, అక్కడి కేదో వాడే మా ఆత్మ బంధువన్నట్లు.

చాలా రోజులుగా ఎందుచేతనో రావటం లేదని చెప్పింది అమ్మ.

నేను వెళ్ళిన మూడో నాడు అన్నయ్య కొడుకు గెంతులేసుకుంటూ వచ్చి, 'అత్తా! అత్తా! కోరడొచ్చాడు' అన్నాడు.

నేను ఆత్రంగా బయటి కొచ్చాను. వాడి చేతిలో కోతి లేదు. వాడి ముఖం దీనంగా వాడిపోయి ఉంది.

'ఏమిరా అలా ఉన్నా' వంటూ మామ్మ పలకరించింది.

"నా బతికే బతుకు పోయిందమ్మా. కోతి ఎక్కడికో పారిపోయింది. రెండు, మూడు నెల్లనుంచి వెతుకుతున్నా దొరికి నప్పలేదు" అంటూ ఇంచుమించు గుడ్ల నీరు కుక్కుకున్నాడు వాడు. వాడిని చూస్తే మా అందరికీ జాలివేసింది.

"అయినా, కోతే కదా అని దాన్ని మరీ విశ్రాంతి లేకుండా ఆడించి చంపితే ఏం చేస్తుందిరా, కోరడా! చక్కా ఎటో చెక్కేసింది. పోనీలే. ఆ దిక్కుమాలిన కోతికోసం ఏడుస్తూ కూచోకు" అంటూ ఓదారుస్తోం దావిడ.

"లేదమ్మా! అది లేకపోతే నే బతక లేను." గద్గదంగా ఉంది వాడి కంఠం.

"ఎక్కడికి పోతుందిరా, పిచ్చినన్నాసీ! ఈ జన్మలో తప్పించుకున్నా వచ్చే జన్మలో నీ పెళ్ళాంగా పుట్టదూ? అప్పు డాడిద్దువు గాన్లే దాన్ని." ఇంకా ఏమి టేమిటో అంటూం దావిడ.

నా మెదడు ఒక్కసారి ఆగి, తిరిగి తీవ్రంగా పనిచెయ్యడం మొదలెట్టింది. ఈ జన్మలో వీడిని తప్పించుకుని పారి పోయినా మళ్ళీ జన్మలో పెళ్ళాంగా మారి రాక తప్పదన్న మాట!

అకస్మాత్తుగా నా కాయన జ్ఞాపకం వచ్చారు.

కోరడు కోతిచేత చేయించే పనులకీ, ఆయన నా చేత చేయించే పనులకీ అట్టే తేడా లేదు. ఎటొచ్చీ అది కోతి, నేను మనిషిని. అంతే.

నా కిప్పు డాయనలో కోతు లాడించే వాడు కనిపిస్తున్నాడు. పూర్వజన్మలో నేను కోతినయి ఉంటాను. నే నప్పుడు కోరడి కోతిలాగే తప్పించుకుని పారిపోయి ఉంటాను. అందుకే ఈ జన్మలో ఆయనకి భార్య నయాను. కోతు లాడించే వాడంటే నా కందుకే నన్నమాట ముందు నుంచీ అంత భయం!

కోరడి కోతి పారిపోయిందట. అవును, కోతి కనక స్వేచ్ఛగా పారిపో గలిగింది. మరి నేను?! ఛీ! ఛీ! ఇదేమిటీ ఆలోచనలు ... ఆయనకు నే నంటే ఎంత ప్రేమ! ఆయనంటే నా కెంత గౌరవం! ఎంతగా సర్ది చెప్పుకోబోతున్నా నా కళ్ళు చెమ్మగిల్లాయి ఎందుకో. ★

చరిత్రకందని అమర వీరులు

# శివా, పిళ్ళే, అయ్యర్‌లు

## ఎ. పండరినాథ్

బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా ఉద్యమం ఉవ్వెత్తున లేచింది. ఎంతోమంది యువకులు రహస్య సమాలోచనలు, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా కుట్రలు సలుపసాగారు.

దక్షిణ భారతంలో సుబ్రహ్మణ్య శివా, జె. వి. చిదంబరం పిళ్ళేలు తీవ్రవాదుల పక్షానికి నాయకులు.

సుబ్రహ్మణ్య శివా గొప్ప వక్త. అంతటి గొప్ప వక్త ఇప్పటివరకు పుట్టలే దంటే ఆశ్చర్యమేమీ లేదంటారు ఆయన్ని ఎరిగినవాళ్ళు. ఆయన మాట్లాడుతూ ఉంటే మాటల్లోనే నిప్పు రవ్వలు పుట్టేవట. స్వాతంత్ర్యోద్యమ జ్వాలల్ని అంతటా రేకెత్తించేవట ఆ నిప్పురవ్వలు.

ఇతని అనుచరుడు చిదంబరం పిళ్ళే కూడా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వదేశీ ఓడల కంపెనీ ఏర్పాటు చేశాడు. అవి సింహళం, భారతదేశాల మధ్య నడిచాయి.

1908 మార్చి 12 న సుబ్రహ్మణ్య శివాను, చిదంబరం పిళ్ళేను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆ మరునాడే తిరునల్వేలి మొదలైన ప్రాంతాల్లో ఎన్నో సంఘటనలు జరిగాయి. చట్టాలను ధిక్కరించి ప్రజలు ప్రభుత్వ ఆస్తినంతా ధ్వంసం చేశారనీ, తిరునల్వేలిలోని అన్ని కార్యాలయాలపై దాడిచేసి తగలబెట్టారనీ రౌలత్ కమిషన్ పేర్కొంది.

వాస్తవంగా అక్కడ జరిగిన సంఘటనలు బ్రిటిష్ అధికారుల్ని కలవరపెట్టాయి. అవసరమైతే వీరిద్దరినీ ఉరితియ్యాలని బ్రిటిష్ అధికారులు నిశ్చయించుకున్నారు. ఇదే సమయంలో 'బెనంబర్' అనే ద్రోహి దక్షిణాదిన టెర్రరిస్టుల ఉద్యమం సాగుతుందని బ్రిటిష్ అధికారులకు తెలియజేశాడు.

బ్రిటిష్ ప్రభుత్వం వెంటనే సుబ్రహ్మణ్య శివా, చిదంబరం పిళ్ళేలకు 8 సంవత్సరాల కఠినశిక్ష విధించింది. ఈ వార్త దేశాన్నంతా కలవరపెట్టింది.

సుబ్రహ్మణ్య శివా, చిదంబరంపిళ్ళేలకు విధించబడ్డ కఠిన శిక్ష వి. ఎస్. శ్రీనివాస శాస్త్రి, వి. కృష్ణస్వామి అయ్యరులాంటి వారికి ఎంతో బాధ కలిగించింది. బెనంబర్ చెప్పిన రహస్యాలే ఇందుకు కారణమని అందరూ అనుకున్నారు.

వీరిద్దరూ హైకోర్టులో అప్పీలు చేసుకోగా వీరి శిక్ష కొంత తగ్గించబడింది.

కాని, ఆ నాటి బ్రిటిష్ ప్రభుత్వం వీరిద్దరినీ ఎంతో బాధించింది. వీరిని నానాకష్టాలకు గురి చేసింది. బ్రిటిష్ అధికారులు వీరి చేతులకు సంకెళ్ళను తగిలించి వీధివీధినా తిప్పారు. జైళ్ళలో గానుగ లాగించారు. రోజుకు పనిమిది గంటలు అతి కష్టతరమైన పనిని చేయించారు. ఉన్నత కుటుంబాలలో జన్మించి, ఎంతో సుకుమారంగా పెరిగిన వీరు ఘోరాతి ఘోరమైన శిక్షలు అనుభవించారే కాని, బ్రిటిష్ అధికారుల ముందు తల వంచలేదు.

ఆ తరవాత యా. సి. తిరునల్వేలి కలెక్టరుగానూ, మేజిస్ట్రేట్‌గానూ నియమింపబడ్డారు. భారతీయ విప్లవకారు లంటే మండిపడేవా డతడు; అసహ్యించుకునేవాడు. అతడు రావడంతోనే సభలూ, సమావేశాలూ జరుపుకోరా దన్నాడు. పత్రికలపై 'వందేమాతరం' జాతీయ గీతంపై నిషేధాన్ని ప్రకటించాడు.

యా. సి. ప్రవేశ పెట్టిన ఈ నిర్బంధాలు వారిని మరీ రెచ్చగొట్టాయి. విప్లవ నాయకులంతా తమ కార్యాలయాన్ని పుదుచ్చేరికి మార్చుకున్నారు.

ఈ సందర్భంలోనే వి. వి. ఎస్. అయ్యర్ దేశభక్తినీ, సాహసోపేతమైన గాథనూ మనం ఎలా మరిచిపోగలం? అయ్యర్ బార్—ఎట్ లా చదవడానికి ఇంగ్లండ్ వెళ్ళాడు. ఇంగ్లండ్‌లో వినాయక్ దామోదర్ సావర్కర్‌తో కలిసి పనిచేశాడు. అక్కడ 'నవ భారత్ మండలి' స్థాపనలో ఎంతో తోడ్పడ్డాడు.

ఈ లోగా 1911 లో దేశంలో కొంత ప్రశాంత వాతావరణం ఏర్పడగానే అయిదవ జార్జి పట్టాభిషేకం చేసుకోవడానికి వస్తున్నట్లు వార్త వినవచ్చింది. సమయం అసన్నమైందని మద్రాసులోని యువ విప్లవకారులంతా అనుకున్నారు. జార్జి చక్రవర్తి ప్రాణాలకే ఎసరు పెట్టారు. చేస్తే అలాంటి సాహస కృత్యమే చేయాలనుకున్నారు.

జూన్ 11 న తిరునల్వేలి కలెక్టర్ యా. పి. దునియాబీ రైలు జంక్షన్‌లో బండి ఎక్కాడు. అదే డబ్బాలో యూరోపియన్ దుస్తుల్లో ఉన్న యువకు డొకడు ఎక్కాడు. సమయం చూసి రివాల్వర్ తీసి ధన్! ధన్! మని మూడు సార్లు పేల్చాడు. యా. సి. రక్తపు మడుగులో పడి కొట్టుకోసాగాడు.

ఆ తరవాత రివాల్వర్ పేల్చిన యువకుడు రైలు దిగి వెయిటింగ్ రూమ్ లోకి వచ్చి అదే రివాల్వర్‌తో తనను కాల్చుకున్నాడు. భారతీయులకు బద్ధ విరోధియైన యా. సి. ని చంపి తన కోరిక నెరవేర్చుకున్న యువకుడు, తనను తానే కాల్చుకున్న యువకుడు ఎవరో కాదు; వాంఛిలే వి. ఎస్. అయ్యర్. బ్రిటిష్ వారి చేతుల్లో చావ నిష్టపడక అయ్యర్ తనకు తానే కాల్చుకున్నాడు. ★